
సాక్షి
బాపట్ల
ఆదివారం । 4 । ఆగస్టు । 2024



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 4,500 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 1,279 క్యూసెక్కులు వదిలారు.



అమ్మవారికి సారె సమర్పణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆలయ సెక్యూరిటీ విభాగం శనివారం సారెను సమర్పించింది.

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి తాడేపల్లికి చెందిన ముళ్లపూడి వెంకట సత్య భగవాన్ శనివారం రూ.1,01,116 అందజేశారు.



న్యూస్‌రీల్

ఒలింపిక్ క్రీడాకారులకు కలెక్టర్ శుభాకాంక్షలు



నరసరావుపేటఈస్ట్: పారిస్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ ఒలింపిక్–2024 క్రీడలను పురస్కరించుకుని భారత క్రీడాకారులకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శుభాకాంక్షలు తెలియజేశారు. సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో శనివారం ఒలింపిక్ క్రీడల లోగోలో సెల్ఫీ దిగి క్రీడాకారులకు చీర్ ఫర్ భారత్ అంటూ ఆల్ ది బెస్ట్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.సురేష్, క్రీడా కోచ్‌లు పాల్గొన్నారు.

రైలింజన్ ఎక్కి బాలుడి హల్‌చల్

- బాలుడి స్వస్థలం కోల్‌కత
- సురక్షితంగా చైల్డ్‌లైన్ సిబ్బందికి బాలుడి అప్పగింత



చీరాల అర్బన్, బాపట్ల టౌన్: రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న రైలింజన్ పైకి ఎక్కి ఓ బాలుడు కొంతసేపు హల్‌చల్ చేశాడు. అరగంట పాటు రైల్వే, ఆర్పీఎఫ్ సిబ్బందిని హైరానా పెట్టాడు. చివరకు అతడిని సురక్షితంగా కిందకు దింపారు. ఆర్పీఎఫ్ చీరాల సీఐ బి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు... పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్‌కతాకు చెందిన సుషాంత్ షికారి (17) అనే బాలుడు శనివారం నెల్లూరులో గూడూరు నుంచి విజయవాడ వెళ్లే ఇంటర్‌సిటీ రైలు ఎక్కాడు. రైలు ఇంజిన్ వెనుక ఉన్న జనరల్ బోగీలో ప్రయాణించాడు. ఉదయం రైలు బాపట్ల రైల్వేస్టేషన్‌లో ఆగడంతో ఒక్కసారిగా బాలుడు రైలు ఇంజిన్ పైకి ఎక్కాడు. అక్కడ ఉన్నవారంతా అతడిని చూసి కేకలు వేశారు. దీంతో రైలు లోకో పైలెట్ ఇంజిన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కిందకు దిగమని చెప్పినా వినకుండా ఇంజిన్ పైనే కూర్చొన్నాడు. అర్ధగంట పాటు రైల్వే, ఆర్పీఎఫ్ సిబ్బందిని టెన్షన్ పెట్టాడు. చివరకు సురక్షితంగా అతడిని కిందకు దింపారు. ఆర్పీఎఫ్ పోలీసులు అతడి వద్ద నుంచి వివరాలను నమోదు చేశారు. బాలుడి మానసిక స్థితి సక్రమంగా లేకపోవడంతో ఈ విధంగా ప్రవర్తించాడని భావిస్తున్నారు. రైల్వే సిబ్బంది అప్రమత్తంగా లేకుంటే పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి పెద్ద ప్రమాదమే జరిగేది. బాలుడు మైనర్ కావడంతో అతని చైల్డ్‌లైన్ సిబ్బందికి అప్పగించామని, చైల్డ్‌లైన్ సిబ్బంది బాలుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందిస్తారని సీఐ తెలిపారు.

హత్యకేసును ఛేదించిన పోలీసులు

వివరాలు వెల్లడించిన డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ



బాపట్లటౌన్: మండలంలోని చెరువుజమ్ముల పాలెం గ్రామంలో జూలై 30న జరిగిన హత్యకేసులో నిందితులను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ శనివారం సాయంత్రం తన కార్యాలయంలో వెల్లడించారు. జూలై 30న చెరువుజమ్ముల పాలెం గ్రామంలోని కల్వర్ట్‌పై కూర్చొని మద్యం సేవిస్తున్న చెట్టుపల్లి విద్యాసాగర్‌ను అదే గ్రామానికి చెందిన బొల్లాపల్లి జయరాజు, యర్రజొన్నల షద్రక్, బొలిమేర సురేష్, కటికల రమేష్‌లు పాతకక్షల నేపథ్యంలో కింద పడేసి కాళ్లు, చేతులతో కొట్టారు. ఈ ఘటనలో పొట్టపై ఎక్కి ఒకరి తర్వాత మరొకరు తొక్కడంతో పొట్టలోపల రక్తస్రావం జరిగి తీవ్ర గాయాలతో బాపట్ల ఏరియా వైద్యశాలలో చేరాడని, అనంతరం గుంటూరు తరలించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడన్నారు. కేసులో నిందితులను శనివారం సాయంత్రం పట్టణంలోని బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపరిచామన్నారు. కేసును ఛేదించిన సీఐ శ్రీహరి, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

దుర్గమ్మను దర్శించుకున్న శివస్వామి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను తాళ్లాయిపాలెం శివ స్వామి, దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన స్వామిజీకి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో రామరావు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఎత్తిన లాఠీ దించారు!

- రేపల్లె, వేమూరుల్లో పేకాట కేంద్రాలు
- వాటిపై చర్యలకు యత్నించిన పోలీసు అధికారి
- ఆగ్రహించిన అధికార పార్టీ ముఖ్యనేత
- ఉన్నతాధికారి నుంచి పోలీస్‌బాస్‌కు ఫోన్
- పేకాట కేంద్రాల జోలికి వెళ్లొద్దంటూ హుకుం
- అధికారపార్టీ, పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా వ్యవహారం
- జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున పేకాట కేంద్రాలు
- అంతేస్థాయిలో కోడిపందేలు
- జూదంతో రోడ్డున పడుతున్న కుటుంబాలు

పేకాట కేంద్రాలపై చర్యలకు పోలీసుల వెనకడుగు



సాక్షి ప్రతినిధి,బాపట్ల: రేపల్లె, వేమూరు నియోజకవర్గాలతోపాటు జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున పేకాట కేంద్రాలు వెలసి, జూదం మూడుపువ్వులు ఆరు కాయలుగా నడుస్తున్నా జిల్లా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోలేని నిస్సహాయ స్థితికి చేరిందా? అధికారపార్టీ నేతల ఒత్తిడితో అక్రమాలపై లాఠీ ఝులిపించలేని పరిస్థితి నెలకొందా? దీంతో జిల్లా అధికారితోపాటు మిగిలిన కొందరు కింది స్థాయి అధికారులు అంతర్మథనం చెందుతున్నారా? ఇదే అదనుగా కొందరు ఇంటిదొంగలు నెల మామూళ్లతో సొంతలాభం చూసుకుంటున్నారా? ఈ ప్రశ్నలన్నింటికీ కొందరు పోలీసు అధికారులు, సిబ్బంది నుంచి అవుననే సమాధానం వస్తోంది.

నిస్సహాయతకు నేపథ్యం..

రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో పేకాట, కోడి పందేలపై జూలై 31న సాక్షిలో 'పేకాట'లో ఇదిగో నీవాటా! శీర్షికన ప్రచురితమైన కథనం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. దీనికి స్పందించిన జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ స్థానిక పోలీసు అధికారులను మందలించారు. అక్రమాలపై ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ ఆగ్రహించారు. అంతేకాక ఆయన ఆయా కేంద్రాలను విజిట్ చేసేందుకు యత్నించినట్లు సమాచారం. ఎస్పీ తనిఖీల విషయం కొందరు పోలీసులు అధికారపార్టీ ముఖ్య నేతకు ఉప్పందించారు. దీంతో ముఖ్యనేత ఏకంగా ఓ పోలీసు ఉన్నతాధికారి ద్వారా జిల్లా పోలీసు అధికారికి ఫోన్‌చేయించి పేకాట కేంద్రాల జోలికెళ్లొద్దంటూ వర్తమానం పంపినట్లు సమాచారం. ఆమేరకు పోలీసుబాస్ పేకాటకేంద్రాల జోలికెళ్లలేదని పోలీసు వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. అదేరోజు పేకాట నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తున్న ముఖ్యనేత అనుచరులు కొందరు పోలీసు బాస్‌ను కలిసి బొకేలు, శాలువాలతో సన్మానించడం మరింత చర్చనీయాంశంగా మారింది.

ఒత్తిడి పెంచిన అధికార పార్టీ..

కూటమి పాలనలో జిల్లా పోలీసు యంత్రాంగంపై ఒత్తిడి పెరిగింది. మేముచెప్పిందే చేయాలని కీలక నేతలతోపాటు కొందరు ప్రజాప్రతినిధులు, నేతలు హుకుం జారీచేస్తున్నారు. ఇది ముక్కుసూటిగా పని చేసే పోలీసు అధికారులకు మింగుడు పడటంలేదు. ముఖ్యంగా కొత్తగా జిల్లాకు వచ్చిన ఎస్పీ తుషార్ డూడీ మరికొందరు అధికారులు దీనిని సహించలేకన్నారు. ఎస్పీకి నిష్పాక్షికంగా వ్యవహరిస్తారన్న పేరుంది. ఆయన విధుల్లోనూ చురుగ్గా ఉంటారు. పోలీసులనూ ఆ దిశగా నడిపిస్తారన్న పేరుంది. ఆయనను కాస్తంత స్వేచ్ఛగా పనిచేయనిస్తే జిల్లాలో నేరాలు అదుపులో ఉంటాయి. కానీ అధికారపార్టీ ఒత్తిడి ఆయన విధులకు అడ్డంకిగా మారినట్లు తెలుస్తోంది.

నేరాలకు అడ్డాగా మారుతున్న జిల్లా...

ఇప్పటికే జిల్లాలో నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 59 రోజుల కూటమి పాలనలో ఒక్క చీరాలలో మూడు హత్యలు, ఒక రేప్ ఘటనలు జరిగాయి. ఇక్కడికి గోవా మద్యం నిత్యం తరలివస్తోంది. బాపట్ల, చీరాల ప్రాంతంలోని రిసార్ట్‌లతోపాటు అన్ని ప్రాంతాలకు సరఫరా అవుతోంది. గంజాయి రవాణాకు అడ్డు అదుపూ లేకుండావుంది. నేరప్రవృత్తికి గంజాయి ఊతమిస్తోంది. వీటిని అదుపు చేయాల్సివుంది.

తమవాడనే సంకేతానికే..!

వాస్తవానికి ఎస్పీతుషార్ డూడీ శాలువాలు, బొకేలు, సన్మానాలకు దూరంగా ఉంటారన్న పేరుంది. కానీ వారు వచ్చి కలుస్తారని ఉన్నతస్థాయినుంచి వర్తమానం రావడంవల్లే రేపల్లె పేకాట నిర్వాహకులను ఎస్పీ కలిసినట్లు సమాచారం. వకుల్ జిందాల్ ఎస్పీగా ఉన్న సమయంలో ఎంపీ మోపిదేవి ఇంటికి వెళ్లిన విషయంపై రేపల్లె టీడీపీ నేతలు రచ్చ చేశారు. ఐపీఎస్ అధికారిగా ఉండి ఎంపీ ఇంటికి ఎలా వెళతారంటూ ఎస్పీపై విమర్శలు గుప్పించారు. అలాంటిది ఇప్పుడు పేకాటలు నిర్వహించే కొందరు ఎస్పీని కలవడంతోపాటు ఆ ఫొటోలు బయటకు వదలి ఎస్పీ తమవాడేనన్న సంకేతాలు ఇవ్వడం మరింత చర్చకు దారితీసింది.

పేకాట, కోడిపందేలకు పెట్టింది పేరు..

రేపల్లె, వేమూరు నియోజకవర్గాలు పేకాట, కోడిపందేలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. రేపల్లె ఓల్డ్‌టౌన్‌లో మూడు పేకాట కేంద్రాలు నడుస్తుండగా, గుడ్డికాయలంక, పద్మావతి టాకీస్ సెంటర్, బస్టాండ్ ఏరియాలో పేకాట కేంద్రాలు నడుపుతున్నారు. నగరం మండలం వెలమవారిపాలెం, చెరుకుపల్లి భవానీపురం, నిజాంపట్నం మండల కేంద్రం సమీపంలోని ఒక గ్రామంలో పేకాట కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఒక్క రేపల్లె నియోజకవర్గంలోనే 20 పేకాట కేంద్రాలున్నాయి. వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు, భట్టిప్రోలు, వేమూరులోనూ పెద్ద ఎత్తున పేకాట నడుస్తోంది. కొందరు అధికారపార్టీ నేతల గెస్ట్‌హౌస్‌ల్లో సైతం పేకాట కేంద్రాలు ఉన్నాయి. పై రెండు నియోజకవర్గాల్లో నిత్యం కోడిపందేలు జరుగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లోనూ పేకాట జోరందుకుంది. అక్రమమద్యం, గంజాయి పెద్ద ఎత్తున తరలివస్తోంది. ఇప్పటికే వాటి బారిన పడి వందలాది కుటుంబాలు ఆర్థికంగా చితికి వీధిన పడ్డాయి. చాలామంది ఆత్మహత్యలు చేసుకున్నారు. పోలీసులను స్వేచ్ఛగా పనిచేయనిస్తేనే అక్రమాలు అదుపులో ఉంటాయి. లేకపోతే జిల్లాలో నేరాలు మరింత పెరిగే అవకాశముంది. ఇప్పటికైనా అధికారపార్టీ నేతలు ఆ దిశగా ఆలోచించాలి. పోలీసుల విధులకు అడ్డుతగలకుండా వారిని పనిచేయనివ్వాలని జిల్లా వాసులు కోరుతున్నారు.



పచ్చ దౌర్జన్యంపైనా స్పందించరా?

- ఎస్ఐ చొక్కాపట్టుకున్న టీడీపీ కార్యకర్త
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- అయినా తమకేమీపట్టనట్లు పోలీసు అధికారులు



టీడీపీ కార్యకర్తలు, పోలీసులకు మధ్య వాగ్వివాదం

సాక్షి ప్రతినిధి,బాపట్ల: అధికారపార్టీ నేతలు ఏకంగా తమపైనే దాడులకు దిగుతున్నా పాపం జిల్లా పోలీసులు స్పందించలేకున్నారు. కిందిస్థాయి అధికారులు, సిబ్బంది కూటమి నేతల చేతిలో అవమానాలు ఎదుర్కొంటున్నా పోలీసు అధికారులకు పట్టడంలేదు. ఉన్నతాధికారుల తీరువల్లే కూటమి నేతలు ఏకంగా పోలీసుల పైనే దాడులకు తెగబడుతున్నారు. జిల్లాలోని రేపల్లె, వేమూరు ప్రాంతాల్లో పేకాట, కోడిపందేలు పెద్ద ఎత్తున జరుగుతున్నా అధికారపార్టీ నేతలకు భయపడి జిల్లా పోలీసులు స్పందించని పరిస్థితి. దీంతో కూటమి నేతలకు పోలీసులపై చులకన భావం ఏర్పడింది. వారు ఏకంగా పోలీసులపైనా దాడులకు తెగబడడం గమనార్హం.

తాజాగా వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలులో టీడీపీ కార్యకర్త తాండవకృష్ణ అనే వ్యక్తి నగరం ఎస్ఐ కోటేశ్వరరావు చొక్కా పట్టుకున్నారు. ఆయనను నెట్టివేశారు. పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. అధికారపార్టీ కావడంతో పాపం ఎస్ఐ నోరుమెదపలేక మిన్నకుండిపోయారు. టీడీపీ కార్యకర్త ఎస్ఐని చొక్కాపట్టుకొని తోస్తున్న వీడియో క్షణాల్లో బయటకు వచ్చింది. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయినా పోలీసులకు స్పందనలేదు.

కష్టమా.. మేమున్నాం నేస్తమా

వారంతా చిన్ననాటి స్నేహితులు.. కలిసి చదువుకున్నారు.. కలిసి ఆడారు.. పాడారు. ఏటేటా సమ్మేళనం ఏర్పాటు చేస్తూ కలుస్తూ వస్తున్నారు. అంతవరకైతే పెద్ద విశేషమేమిలేదు.. అయితే సమ్మేళనానికి కొందరు హాజరుకాకపోవడం, వచ్చిన వారిలో కొందరు వివిధ సమస్యలతో బాధపడుతూ ఉండడం చూసి చలించిపోయారు. అందరూ చర్చించి ఓ నిర్ణయానికి వచ్చారు. తమ పరిధి మేరకు వివిధ సమస్యలతో బాధపడుతున్న తమ స్నేహితులను ఆదుకోవాలని తలంచారు. అనుకున్నదే తడవుగా తమ ఆలోచనకు కార్యరూపం ఇచ్చారు. ఆదుకోవడం ప్రారంభించి, నిజ స్నేహానికి నిర్వచనంగా నిలిచారు.

- స్నేహానికి నిర్వచనంగా నిలుస్తున్న పూర్వ విద్యార్థులు
- స్నేహితుల కష్టనష్టాలను తెలుసుకుంటూ చేతనైనంత సాయం చేస్తూ..
- ఆదర్శవంతంగా వేటపాలెం బీబీహెచ్ పూర్వ విద్యార్థులు




బీబీహెచ్ పూర్వ విద్యార్థులు

వేటపాలెం: వేటపాలెం బండ్ల బాపయ్య హిందూ స్కూల్‌లో 1994–95 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన 270 మంది విద్యార్థులు చదువు అనంతరం వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అప్పుడప్పుడు కలుస్తూ వస్తున్నారు. అయితే 2019 జనవరిలో వీరు మరోసారి కలుసుకున్నారు. సుమారు 150 మంది హాజరైన నాటి సమ్మేళనంలో ఒక సంకల్పానికి నాంది పలికారు. ఆపదలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమ చిన్ననాటి స్నేహితులను, వారి కుటుంబ సభ్యులను, అభాగ్యులను ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు.

వారు చేసిన సేవా కార్యక్రమాలు ఇవి..

- పూర్వవిద్యార్థి గుడిపల్లి సురేష్ అకాల మరణం చెందగా అతని కుటుంబానికి రూ. 30 వేలు స్నేహితుడి కుమార్తె పేరుపై పోస్టల్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.
- చిన్ననాటి స్నేహితుడైన గొర్రెముచ్చు ఆనంద్‌బాబు కిడ్నీ సమస్యతో బాధ పడుతుండగా వైద్య ఖర్చుల కోసం రూ. 20 వేలు అందించారు.
- మరో స్నేహితుడు బండారు వీరాంజనేయులు మరణించగా రూ. 50 వేలు అతని కుమార్తె పేరుతో పోస్టల్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అంతేకాకుండా వారి కుటుంబ ఖర్చుల కోసం మరో రూ. 14 వేలు సాయం అందించారు.
- రోడ్డు ప్రమాదంలో తలకు గాయాలై నరాల సమస్యతో బాధపడుతున్న నల్లూరి చంద్రశేఖర్‌కు ప్రమాదం జరిగినప్పుడు రూ. 10 వేలు, కరోనా సమయంలో నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. మందుల ఖర్చులకు రూ. 20 వేలు నగదు అందజేశారు.
- ఇటీవల కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ చేయించుకుంటున్న సంఘం ప్రెసిడెంట్ బేతాళ రామస్వామికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 30 వేలు సంఘం తరఫున మరి కొంత మంది మిత్రులు వ్యక్తిగతంగా నగదు అందజేశారు.

ఒకరికొకరం తోడుగా..



మా స్నేహితులకు సాయం చేయడానికి బయట వారి దగ్గర ఒక్క రూపాయి కూడా తీసుకోవడం లేదు. మా బ్యాచ్ పూర్వ విద్యార్థులంతా కలసి సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. స్నేహితులకు ఆదుకోవడమే మా లక్ష్యం.

– బందా మారుతీ సుబ్రహ్మణ్యం, పూర్వ విద్యార్థి, బెంగళూరు

మతాలకతీతమైన స్నేహం..

చినగంజాం: మతాలు వేరైనా.. వృత్తులు వేరైనా వారి స్నేహబంధం పాతికేళ్లుగా కొనసాగుతోంది. కల్మషం లేని స్నేహానికి కులాలు, మతాలు అడ్డు రావని వారు నిరూపించారు. ఎన్ని కష్టాలు వచ్చినా, ఇబ్బందులు ఎదురైనా తమ పవిత్ర స్నేహాన్ని విడవకుండా పయనిస్తున్నారు చినగంజాంలోని ఇస్లాంపేటకు చెందిన షేక్ జిలానీ, కొత్తపాలెం పంచాయతీ సత్తాయి పాలేనికి చెందిన కోలా సుబ్బారావులు. వృత్తిరీత్యా జిలానీ పెయింటర్ కాగా సుబ్బారావు వడ్రంగి పని చేస్తుంటాడు. చిన్నానాటి స్నేహితులైన వీరిద్దరి ఇళ్లలో జరిగే వేడుకల్లో అందరూ ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి పాల్గొంటారు.. ఒకరి సంతోషంలో ఒకరు పాలిభాగస్తులై ఆనందిస్తారు. కష్టనష్టాలు ఎదురైనా అంతే.. ఒకరికొకరు అండగా నిలిచి, ఆదరించుకుంటారు. వారిద్దరి స్నేహం చూసిన పరిచయస్తులు ముచ్చటపడుతుంటారు. నిజస్నేహానికి కులం, మతం, వృత్తి తదితరాలేవీ అడ్డురావని, కల్మషం లేని మనసుంటే చాలని వారు నిరూపించారు.



షేక్ జిలాని, కోలా సుబ్బారావు

భట్టిప్రోలులో వేడెక్కిన రాజకీయం

- సవాళ్లు, ప్రతి సవాళ్లతో రంగంలోకి పోలీసులు
- 30 పోలీస్‌యాక్ట్ అమలుతో నిర్మానుష్యంగా రహదారులు
- వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌బాబును చెరుకుపల్లిలో హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

భట్టిప్రోలు: వేమూరు నియోజకవర్గంలో, భట్టిప్రోలు మండలంలో తెలుగుదేశం పార్టీ నేతలు చేస్తున్న దోపిడీ, అక్రమాలు, అవినీతిపై బహిరంగ వేదికపై చర్చిద్దామన్న వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సవాలుకు మీడియా ముఖంగా స్పందించిన టీడీపీ నాయకులు అనంతరం శాంతిభద్రతలను సాకుగా చూపి, ముఖం చాటేసిన వైనంపై మండల ప్రజలు విస్తుబోతున్నారు. వివరాల్లోకి వెళితే.. వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, భట్టిప్రోలుకు చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబాల సవాళ్లతో నియోజకవర్గ రాజకీయం వేడెక్కింది. చర్చా వేదిక ఏర్పాటు చేసి నిజ నిర్ధారణ చేసుకునేందుకు ఇరువురు సన్నద్ధులయ్యారు. ఇందుకు వేదికగా శనివారం ఉదయం 11 గంటలకు భట్టిప్రోలు రథం సెంటర్‌ను ఖరారు చేశారు. దీంతో శుక్రవారం నుంచే రేపల్లె డీఎస్పీ పి.మురళీకృష్ణ 30 పోలీస్ యాక్ట్ అమలులోకి తీసుకువచ్చారు. ఈ మేరకు పోలీసులు చర్చా వేదికకు అనుమతి లేదని ఇరువురికి నోటీసులు అందించి సంతకాలు కూడా తీసుకున్నారు. అశోక్‌బాబు తగు సాక్ష్యాధారాలతో భట్టిప్రోలుకు బయలు దేరడంతో ఆయనను చెరుకుపల్లిలోని స్వగృహంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. భట్టిప్రోలులో సాయిబాబును హౌస్ అరెస్ట్ చేశారు. భట్టిప్రోలు గ్రామం పోలీస్ చక్ర దిగ్బంధనంలో ఉండటంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి.



చెరుకుపల్లిలోని తన నివాసం వద్ద మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదు...

ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు మాట్లాడుతూ పోలీసులను అడ్డుపెట్టుకుని తమ నోరు మూయించాలని చూసిన టీడీపీ నాయకులు గ్రామాల్లో చేసే అరాచకాన్ని ప్రజలు చూస్తూనే ఉన్నారని అన్నారు. తనను హౌస్ అరెస్టు చేసి నైతికంగా టీడీపీ వారు చేసే తప్పులను వారే ఒప్పుకున్నారని అన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని పేర్కొన్నారు. త్వరలోనే జగన్ పాలన మళ్లీ వస్తుందని పార్టీ క్యాడర్ అంతా ధైర్యంగా ఉండాలని కోరారు. టీడీపీ కూటమి నాయకులు అధికారం అడ్డం పెట్టుకుని ప్రజలను దోచుకోవడం మొదలు పెట్టేశారని అన్నారు. ఇదిలా ఉండగా గ్రామంలో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు పోలీస్ పహారా కొనసాగుతూనే ఉంది. ఆయన వెంట ఎంపీపీ దావూరి నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, జిల్లి జోషికాంత్, కరిసెట్టి బాలు, జడా రవీంద్రబాబు, అబ్దుల్లాబేగ్, మద్దుల గిరిధర్, దారా చెన్నయ్య, కె.శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు. రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో చుండూరు ఇన్‌చార్జి సీఐ, రేపల్లె రూరల్ సీఐలు సీహెచ్ శ్రీనివాసరావు, మల్లిఖార్జునరావుల పర్యవేక్షణలో భట్టిప్రోలు, కొల్లూరు, చెరుకుపల్లి, చుండూరు, రేపల్లె, చోడాయపాలెం, నగరం ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు, రవీంద్రారెడ్డి, ఆవుల హరిబాబు, కోటేశ్వరరావు, రఫీ, రాజ్యలక్ష్మిలతో పాటు 100 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



భట్టిప్రోలులో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల ఆదేశాలను గౌరవించిన అశోక్‌బాబు

పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ వై.సురేష్ చెరుకుపల్లిలో అశోక్‌బాబు హౌస్ అరెస్టును రాత్రి 8 గంటల వరకు పొడిగించారు. పోలీస్ అధికారుల ఆదేశాలను గౌరవించి అశోక్‌బాబు తిరిగి ఇంట్లోకి వెళ్లిపోయారు.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల పింఛన్లు నిలిపివేత

ఎనిమిది మందికి పింఛన్లు ఇవ్వని అధికారులు

జే.పంగులూరు: వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు అనే కారణంగా అధికారులు పింఛన్లు ఆపేశారు. మండల పరిధిలోని రామకూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు 8 మందికి పింఛన్లు ఇవ్వలేదు. ఈమేరకు బాధితులు శనివారం ఎంపీడీఓ మాథ్యూ బాబును కలిశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలో 8 మందికి పింఛన్లను ఆపారన్నారు. తమకు సంబంధించిన నగదు కూడా అధికారుల వద్ద ఉన్నాయని, ఆన్‌లైన్‌లో పేర్లు కూడా ఉన్నాయన్నారు. కానీ బయోమెట్రిక్ పడటం లేదని అధికారులు చెబుతున్నారన్నారు. అనంతరం ఎంపీడీఓ మాథ్యూబాబు మాట్లాడుతూ మండలం మొత్తం మీద 361 మందికి వివిధ కారణాలతో పింఛన్లు ఆగాయన్నారు. దీనిపై సంబంధిత అధికారులకు జాబితా పంపించామన్నారు. వచ్చే నెలలో పింఛన్ రానివారికి రెండు నెలలు కలిపి అందిస్తామని చెప్పారు. ఎంపీడీఓను కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, నాయకులు ఆంజనేయులు, రామాంజినేయులు ఉన్నారు.



ఎంపీడీఓ మాథ్యూబాబును కలిసిన నాయకులు

ప్రభుత్వ ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 26లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లాస్థాయి పారిశ్రామిక శిక్షణా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ బి.సాయి వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ, టీసీ, విద్యార్థి పాటు తల్లిదండ్రులు ఆధార్ జిరాక్స్, విద్యార్థి ఫోటో, సెల్ నంబరు, మెయిల్ ఐడీ, చిరునామా వివరాలతో ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ ద్వారా ప్రైవేటు నెట్ కేంద్రాలతో పాటు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐకి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు.

క్లుప్తంగా

సమగ్రశిక్షలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు ఈనెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని గుంటూరు సమగ్ర శిక్ష ఏపీసీ జి.వి జయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి (సీఎంఓ), ఎంఐఎస్ ప్లానింగ్ కో–ఆర్డినేటర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి(ఏఎస్ఓ) పోస్టులను ఒక్కోటి చొప్పున భర్తీ చేసేందుకు ఫారిన్ సర్వీసు రూల్స్‌కు అనుగుణంగా జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న 55 ఏళ్ల లోపు వయసు గల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మాథ్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులలో పీజీ విద్యార్హతతో గుర్తింపు పొందిన వర్సిటీ, విద్యాసంస్థల నుంచి కంప్యూటర్ పరిజ్ఞానంపై డిగ్రీ, డిప్లొమా కలిగి ఉండాలని తెలిపారు. సీఎంఓ పోస్టు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ పోస్టులకు ఎనిమిదేళ్లు, ఏఎస్ఓ పోస్టుకు ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసి ఉండాలని కోరారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 9వ తేదీ సాయంత్రం లోగా డీఈఓ కార్యాలయంలోని సమగ్రశిక్ష జిల్లా విభాగంలో అందజేయాలని సూచించారు. విద్యార్హతలతో పాటు ఇతర ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలపై తాము పని చేస్తున్న పాఠశాల పరిధిలోని అధికారితో అటెస్టేషన్ చేయించాలని తెలిపారు. పూర్తి వివరాలకు సమగ్రశిక్షగుంటూరు.బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్‌లో సందర్శించాలని సూచించారు.

రేపు న్యాయవాదుల విధుల బహిష్కరణ

నగరంపాలెం: న్యాయవాదులు తప్పుడు కేసులు నమోదుకు నిరసనగా ఈనెల 5న జిల్లాలోని న్యాయవాదులు విధులు బహిష్కరించనున్నట్లు జిల్లా(లాయర్స్) బార్ ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి తెలిపారు. గుంటూరు నగరంపాలెం జిల్లా కోర్టు ఆవరణలోని గుంటూరు బార్ అసోసియేషన్ హాల్‌లో శనివారం జిల్లా(లాయర్స్) బార్ ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. న్యాయవాది జి.గవాస్కర్‌పై, గుంటూరులోని న్యాయవాది బి.నాగరాజుపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ క్రమంలో జిల్లాలోని న్యాయవాదులు విధులను బహిష్కరించాలని పేర్కొన్నారు. సమావేశంలో అధ్యక్షులు పి.ప్రభాకర్ (తెనాలి), శ్రీనివాసరెడ్డి (గురజాల), సత్యప్రసాద్ (బాపట్ల), బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మరెడ్డి పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.5300, మోడల్ ధర రూ.4600 వరకు పలికింది.

ఐక్యంగా జిల్లా అభివృద్ధికి కృషి

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని
- కేంద్రం నుంచి పేదలకు ఇళ్లు మంజూరు చేయిస్తాం
- గుంటూరు జెడ్పీలో ప్రత్యేక సర్వసభ్య సమావేశం
- జెడ్పీ స్థాయీ సంఘాల్లో సభ్యులుగా ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎన్నిక



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా, మంత్రి నాదెండ్ల మనోహర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి క్షేత్ర స్థాయిలో ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం సమష్టిగా ముందుకు వెళదామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని శనివారం గుంటూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. జెడ్పీలోని ఏడు స్థాయీ సంఘాల్లో ఖాళీ అయిన సభ్యుల స్థానంలో కొత్తగా ఎన్నికైన ముగ్గురు ఎంపీలతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 17 మంది ఎమ్మెల్యేలను ఎన్నుకున్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెమ్మసాని మాట్లాడారు. రాజకీయాలు ఎన్నికల్లో గెలుపోటములకే పరిమితం కావాలని, అధికారంలో ఉన్నప్పుడు కులమతాలకు అతీతంగా అందరినీ సమానంగా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని చెప్పారు. దేశ వ్యాప్తంగా పేదలకు రెండు కోట్ల ఇళ్లను కేంద్రం మంజూరు చేయనుందని, ఇందులో మన రాష్ట్రానికి కనీసం 15 లక్షలు మంజూరు చేయించుకునేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. గుంటూరు ఎంపీగా కేంద్రం నుంచి వివిధ పథకాల ద్వారా మరిన్ని నిధుల్ని తీసుకువచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళతానని పేర్కొన్నారు. గ్రామీణ సడక్, ఉపాధి హామీ, జలజీవన్ మిషన్ వంటి పలు కేంద్ర పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు, కార్యాచరణ, అమలులో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

- ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమం కోసం కలిసి పనిచేయాలని తెలిపారు. రాజకీయాల్లో కక్ష సాధింపు చర్యలకు తావు లేదని స్పష్టం చేశారు.
- మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన మాచర్ల ప్రాంతానికి జెడ్పీ నుంచి నిధులు మంజూరులో తీవ్ర వివక్ష నెలకొంటోందని తెలిపారు. మాచర్లకు ఇప్పటి వరకు కేటాయించిన నిధుల వివరాలు, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాల్ని బహిరంగపరిస్తే వాస్తవాలు వెలుగుచూస్తాయన్నారు.
- బాపట్ల ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్రవర్మ మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ రవాణా, వినియోగదారులకు బియ్యం బదులు డబ్బులు ఇస్తున్న సంఘటనలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని కోరారు.
- తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌లో పైపులైను నిర్మాణాల పేరుతో రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేస్తున్నారని తెలిపారు. తాడికొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి శాశ్వత రీతిలో చర్యలు చేపట్టాలని కోరారు.
- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ అంతా కలిసి ప్రాంత అభివృద్ధికి పాటుపడదామని, వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలు తమతో కలిసి పని చేయాలని ఆయన కోరారు.

ఏడు సంఘాల్లో సభ్యులు ఏకగ్రీవ ఎన్నిక

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సభ్యుల్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రణాళిక ఆర్థిక సంఘంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు నియమితులయ్యారు.

- గ్రామీణాభివృద్ధి సంఘంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, బాపట్ల ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్రవర్మ, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఎన్నికయ్యారు.
- వ్యవసాయ సంఘంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఉన్నారు.
- విద్య–వైద్యం సంఘంలో నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి నియమితులయ్యారు.
- మహిళా సంక్షేమ సంఘంలో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఉన్నారు.
- సాంఘిక సంక్షేమ సంఘంలో బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర నియమితులయ్యారు.
- పనులు–రవాణా సంఘంలో రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో జెడ్పీ సీఈవో ఎన్.వి.బి.ఎస్. వసంతరాయుడు, డిప్యూటీ సీఈవో జె.మోహనరావు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల వ్యవస్థ ప్రక్షాళన



రాష్ట్రంలో పౌరసరఫరాల వ్యవస్థ ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా గత రెండు నెలల్లో రూ.155 కోట్ల విలువైన 53వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామని తెలిపారు. పార్టీలకతీతంగా కలిసి పనిచేసి, నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేద్దామని ఆయన చెప్పారు. జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

నిధులు మంజూరు చేయాలి



జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన జెడ్పీ కార్యాలయ పరిపాలన భవనాన్ని నిర్మించడానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించడానికి కృషి చేయాలని మంత్రి పెమ్మసానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో పలుమార్లు విజ్ఞప్తి చేశామని చెప్పారు. ఇసుక సీనరేజీ, మైనింగ్, స్టాంప్ డ్యూటీకి సంబంధించి ప్రభుత్వం నుంచి జెడ్పీకి రావాల్సిన నిధులు విడుదల చేయాలని అప్పటి సీఎం వైఎస్.జగన్ దృష్టికి తీసుకెళ్లిన మీదట దానికి ఆయన అంగీకరించినప్పటికీ, ఆర్థికశాఖ అధికారులు నిలిపివేశారని తెలిపారు.

వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు హేయం

పార్టీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి



మాట్లాడుతున్న పానెం చిన హనిమిరెడ్డి

బల్లికురవ: వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారన్న అక్కసుతో కొందరిపై టీడీపీ నాయకులు, సానుభూతిపరులు దాడులు చేయడం హేయమైన చర్య అని అద్దంకి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఉప్పమాగులూరు పంచాయతీలోని సోమవరప్పాడు గ్రామంలో గురువారం రాత్రి టీడీపీ నేతలు బెదిరించడంతోపాటు చప్టాపై నుంచి నెట్టివేయడంతో కొండపర్తి అంజయ్య చనిపోగా, బాధిత కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో చిన హనిమిరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని హితవు పలికారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. పొలం పని చేసుకుని ఇంటికి వచ్చిన అంజయ్యను లారీతో తొక్కిస్తామని బెదిరించడమే కాకుండా కూర్చొని ఉన్నప్పుడు చప్టాపై నుంచి నెట్టడం వల్లే అపస్మారక స్థితికి చేరుకొని చనిపోయాడన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని ఆ కుటుంబానికి దిక్కెవరని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట మండల నాయకులు దేవినేని కృష్ణబాబు, కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, పావులూరు చందు, షేక్ ఖాదర్, తంగిరాల అయ్యన్న తదితరులు ఉన్నారు.

చందోలు సంత.. వసతులు అంతంత!



చందోలులో ఎండు చేపల సంత నిర్వహిస్తున్న దృశ్యం

- రకరకాల ఎండు చేపల విక్రయానికి ప్రసిద్ధి
- యంత్రాంగం తీరుతో వ్యాపారులకు తప్పని అవస్థలు

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలు సంతలో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. మండలంలోని చందోలులో ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ సంత రాష్ట్ర స్థాయిలో ప్రసిద్ధి చెందింది. ఎండు చేపల క్రయవిక్రయాలకు పేరొందింది. రోజుకు సుమారు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వ్యాపారం జరుగుతుందని అంచనా. కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నానా అవస్థలు పడాల్సి వస్తోందని వ్యాపారులు వాపోతున్నారు. విశాఖపట్నం, కాకినాడ, కొత్తపట్నం, చినగంజాం, నిజాంపట్నం ఓడరేవు, విజయనగరం తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి ఎండు చేపలు తీసుకొస్తుంటారు. ఐతే విజయవాడ, కడప, హైదరాబాద్, కర్ణాటక, చెన్నై, వినుకొండ తదితర ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు వస్తుంటారు.

ఎన్నో రకాల చేపలు

ఈ సంతలో 10 గ్రాముల నుంచి 15, 20 కిలోల ఎండు చేపలు కూడా లభిస్తాయి. పండు చేపలు, చీలికలు, మెత్తళ్లు, చావళ్లు, రొయ్యలు, రొయ్య పట్టు, తోకలు, చందవాలు, విషక దొందులు, వరసలు, పిల్లపగులు తదితర రకాలు ఇక్కడ లభిస్తాయి. సుమారు పది దశాబ్దాలుగా ఈ సంత కొనసాగుతోంది. పాలకులు, అధికారులు మారినా వసతుల గురించి పట్టించుకున్న వారే లేరని వ్యాపారులు వాపోతున్నారు. సౌకర్యాలు కల్పిస్తామని హామీలిస్తున్నారే గానీ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా నక్కపల్లి సంత తర్వాత ఈ సంతే పేరొందిదని వ్యాపారులు తెలిపారు. నిర్వహణకు ఏటా మార్చి నెలలో బహిరంగ వేలం ఏర్పాటు చేస్తారు. ఆదాయం పుష్కలంగా ఉన్నప్పటికీ వసతులు ఆ స్థాయిలో లేవు. పాట దక్కించుకున్న వారు ఎండు చేపల మూటలను బట్టి రూ.10 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తుంటారు. వ్యాపారులు గురువారం రాత్రికే ఇక్కడకు చేరుకుని శుక్రవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం దాటే వరకు ఉంటారు. ఎక్కువగా మహిళలే వస్తుంటారు. వీరికి కనీసం కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా వసతి లేదు. పాలకులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి సౌకర్యాలు కల్పించాలని వ్యాపారులు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య



దుర్గా భవాని మృతదేహం

కర్లపాలెం: పురుగుల మందు తాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామంలో జరిగింది. కర్లపాలెం ఇన్‌చార్జి ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లమోతువారిపాలెం గ్రామానికి చెందిన సూరగాని శ్రీనివాసరావుకు బాపట్ల మండలం ముత్తాయిపాలెంకు చెందిన దుర్గా భవానితో సుమారు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. దంపతులు అప్పుడప్పుడు గొడవ పడే వారు. ఈ నేపథ్యంలో ఏట్రవారిపాలెంకు చెందిన గోపిరెడ్డితో తన భార్య చనువుగా ఉండేదని, అతడి వల్లే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. పొలంలో ఉండగా గోపిరెడ్డి వచ్చి కొట్టటం వల్లే మన స్తాపానికి గురై పురుగుల మందు తాగి ఉండొచ్చని భర్త ఆరోపించారు. శ్రీనివాసరావు అంధుడు కాగా, వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బీసీ, గౌడ సంఘం, జై గౌడ ఉద్యమ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధితురాలి కుటుంబ సభ్యులతో కలిసి డీఎస్పీ మురళీకృష్ణ, బాపట్ల రూరల్ సీఐ హజరత్‌బాబును కలిసి విన్నవించారు.

దూరవిద్యలో సైన్స్ కోర్సులకు అనుమతివ్వండి

యూజీసీ జాయింట్ సెక్రటరీని కోరిన ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు



యూజీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అవిచల్ రాజ్‌కపూర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ

ఏఎన్‌యూ: గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ద్వారా గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యను మరింత చేరువ చేసేందుకు సహకరించాలని యూజీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ అవిచల్ రాజ్‌కపూర్‌ను ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు కోరారు. అకడమిక్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనేందకు విజయవాడ వచ్చిన యూజీసీ జాయింట్ సెక్రటరీని శనివారం ఏఎన్‌యూ వీసీ, ఉన్నతాధికారులు కలిశారు. ఏఎన్‌యూలో చేపడుతున్న విద్య, పరిశోధన అంశాలను ఆయనకు వివరించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రానికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని జాయింట్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్థికంగా వెనుకబడిన, పలు కారణాల వలన రెగ్యులర్‌గా ఉన్న విద్యా కోర్సులు చదవలేని వారికి ఏఎన్‌యూ దూరవిద్యాకేంద్రం ద్వారా అన్ని ఆర్ట్స్, సైన్స్ కోర్సులను గతంలో అందించామని తెలిపారు. విద్యార్థులకు సేవలు అందించడం, స్టడీమెటీరియల్ జారీ, పరీక్షల నిర్వహణ, సర్టిఫికెట్ల జారీ వంటి సేవలను అందించడంలో ఏఎన్‌యూ జాతీయ స్థాయిలో ప్రత్యేక రికార్డును నెలకొల్పిందని తెలిపారు. కొన్ని కారణాల వల్ల కొన్నేళ్ల నుంచి కేవలం ఆర్ట్స్ కోర్సులు మాత్రమే దూరవిద్యలో అందిస్తున్నామని వివరించారు. మళ్లీ సైన్స్ కోర్సులు నిర్వహించేందుకు అనుమతి కోరుతూ జాతీయ స్థాయిలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో(డెబ్)కు యూనివర్సిటీ దరఖాస్తు చేసిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మంజూరుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. దూరవిద్యాకేంద్రం గతంలో అందించిన కోర్సులు, సేవలు, ప్రస్తుతం అందిస్తున్న కోర్సుల వివరాలతో కూడిన సమగ్ర నివేదికను యూజీసీ జాయింట్ సెక్రటరీకి ఏఎన్‌యూ దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు అందజేశారు. జాయింట్ సెక్రటరీని కలిసిన వారిలో ఏఎన్‌యూ దూరవిద్యాకేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్, సీఎస్ఆర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్వీ రమణ ఉన్నారు.